సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 7 । మార్చి । 2023



కాసుల వర్షం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని 11 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రూ. 204 కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. 8లో



తరలిరాద తనే వసంతం..

వసంత రుతువును ఆహ్వానిస్తూ వచ్చే హోలీ పండుగను నేడు ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉన్నా.. తెల్లవారుజామున, రాత్రి వేళలో కొంత చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 10 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం అగ్నిప్రతిష్ఠ, హవనం, గరుడపటాధివాసం, ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం తదితర కార్యక్రమాలను గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాళ్లూరి శివరాజ్ దంపతులు, ఏఓ అనూష దంపతులు, ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

ఇల్లెందు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ సోమశేఖర శర్మ సూచించారు. ఇల్లెందులోని బాలికోన్నత పాఠశాల, మెయిన్‌రోడ్ హైస్కూల్, జేబీఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రత్యేక బోధన సాగించాలని, పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక రూపొందించి ఉదయం, సాయంత్రం విద్యార్థులను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

చుంచుపల్లి: మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ శిరీష సూచించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు బ్రెస్ట్, గర్భస్థ కేన్సర్‌లపై అవగాహన కల్పించాలని అన్నారు. స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్లు సుకృత, మణికంఠారెడ్డి, వాణి, రేణుక, స్పందన, ప్రియాంక, లోహిత పాల్గొన్నారు.

10 నుంచి మూడో విడత టెండర్లు

పాల్వంచరూరల్: తునికాకు సేకరణకు ఇప్పటి వరకు రెండు విడతలు టెండర్లు నిర్వహించగా జిల్లాలోని ఆరు అటవీ డివిజన్ల పరిధిలోని 57 యూనిట్లలో 70 శాతం మేర కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. మిగిలిన 30 శాతం సేకరణ పనులకు ఈ నెల 10 నుంచి 16 వరకు మూడో విడత టెండర్లు ఆహ్వానిస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డీఎం పృథ్వీరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న టెండర్ నోటీసును డౌన్‌లోడ్ చేసుకుని, 15, 16 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయాలని పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్లపై ఫిర్యాదుల వెల్లువ

కలెక్టరేట్‌కు కదం తొక్కిన మహిళలు

- గ్రీవెన్స్‌లో వినతుల వెల్లువ
- గళం విప్పిన అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు
- అనర్హులను తొలగించాలని డిమాండ్



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అక్రమాలపై ఆందోళన చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి లంచాలు ఇచ్చినట్టు తెలిస్తే, ఇళ్ల కేటాయింపును రద్దు చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సభాముఖంగా ప్రకటించారు. 'డబుల్' లాటరీని వీడియో కెమెరాల్లో రికార్డు చేస్తూ పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. అయితే వీరిద్దరి ప్రకటనలను సవాల్ చేస్తూ వందలాది మంది పేదలు జిల్లా కార్యాలయాల సమీకృత భవనం (ఐడీఓసీ) గడపతొక్కారు.

కిక్కిరిసిన గ్రీవెన్స్..

ఇటీవల ఐడీఓసీ ప్రారంభమైన తర్వాత క్రమం తప్పకుండా గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నారు. ప్రధాన విభాగాలకు చెందిన కీలక అధికారులంతా హాజరవుతున్నారు. అయితే ఈ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు ప్రజలు తమ విన్నపాలతో పోటెత్తారు. ఐడీఓసీ కార్యాలయానికి కలెక్టర్ చేరుకోక ముందే వందల సంఖ్యలో ప్రజలు విజ్ఞప్తులతో అక్కడికి వచ్చారు. ఆ తర్వాత ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలోనూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నవారు అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రీవెన్స్ సెల్‌లో తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చిన వారి సంఖ్య సుమారు 500కు చేరుకుంది. ఇందులో 80 శాతం మంది కేవలం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవినీతిపైనే తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు ఇచ్చేందుకు రావడం గమనార్హం.

రీ సర్వే చేస్తామన్న అధికారులు..

గ్రీవెన్స్‌సెల్‌లో లెక్కకు మిక్కిలిగా ఫిర్యాదులు రావడంతో కొన్నింటిని కలెక్టర్ స్వీకరించగా మరికొన్నింటిని ఇతర అధికారులు తీసుకున్నారు. అయినా ఫిర్యాదుదారులు వస్తూనే ఉండటంతో చివరకు 'డబుల్' ఫిర్యాదులను అటెండర్లు సైతం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఫిర్యాదుదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు 200 మందికి పైగా ఫిర్యాదులుదారులు ఐడీఓసీ ప్రాంగణంలో గుమిగూడి 'కలెక్టరే స్వయంగా ఫిర్యాదులు తీసుకోవాల'ని డిమాండ్ చేశారు. చివరకు డీఆర్‌ఓ అశోక చక్రవర్తి బయటకు వచ్చి అక్కడున్న మహిళలతో మాట్లాడారు. 'లబ్ధిదారుల ఎంపికలో వస్తున్న ఆరోపణలపై విచారణ చేస్తాం. అనర్హులు ఉన్నట్టు తేలితే రద్దు చేస్తాం. తిరిగి లాటరీ ద్వారా అర్హులను ఎంపిక చేస్తాం' అని హామీ ఇచ్చారు.

మాలో మాకే కొట్లాట పెడతారా..?

'అవినీతికి తావు లేకుండా లాటరీలో లబ్ధిదారులను ఎంపిక చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ కార్లు ఉన్నవారు, ఇప్పటికే ఇళ్లు ఉన్న వారు, ఒకే ఇంట్లో ఇద్దరికి.. ఇలా అనేక మంది అనర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కాయి. సరైన జీవనాధారం లేక, సొంత ఇల్లు కూడా లేని ఎంతోమంది మాలాంటి పేదల పేర్లు లాటరీలో రాలేదు. ఇదేంటని ప్రశ్నిస్తే అనర్హుల పేర్లు చెప్పండి, మేం తొలగిస్తాం అని అధికారులు అంటున్నారు. ఒకే వాడలో ఉండేటోళ్లం, 'అనర్హులు' అని మేం చెబితే మాలో మాకు గొడవలు జరగవా? రేపు మేం కాలనీల్లో ఒకరికొకరు కొట్టుకోవాలా? ఇంత మంది మూకుమ్మడిగా వచ్చి లబ్ధిదారుల ఎంపిక సజావుగా జరగలేదని చెబుతున్నాం. మా ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని అధికారులు విచారణ చేసి నిజానిజాలను నిర్ధారించాలి' అని గ్రీవెన్స్‌కు వచ్చిన వందలాది మంది మహిళలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

ఆది నుంచీ ఆందోళనలే..

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు సంబంధించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈనెల 2వ తేదిన లాటరీ నిర్వహించారు. ఈ ప్రక్రియ మొదలైన కొద్దిసేపటికే, అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు, విమర్శలు మొదలయ్యాయి. రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు లంచాలు తీసుకుని అనర్హులకు ఇళ్లు కేటాయించారంటూ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఆడియో లీకులు విడుదలయ్యాయి. కొందరు కౌన్సిలర్లు, మరికొందరు నాయకుల పైనే అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే వీటిపై లిఖిత పూర్వకంగా మాత్రం ఎలాంటి ఫిర్యాదులు అధికారులకు అందలేదు. కాగా సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో వ్యక్తిగతంగా, ప్రజాసంఘాల నేతలు రాత పూర్వక ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్, సీపీఎం, న్యూడెమోక్రసీ, బీఎస్పీ నాయకులు ఇదే అంశంపై తమ అభ్యంతరాలను కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేశారు.

నిష్పక్షపాతంగా విచారణ చేస్తాం

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అనర్హులు లబ్ధి పొందినట్లు వస్తున్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహిస్తామని కలెక్టర్ అనుదీప్ స్పష్టం చేశారు. ఐడీఓసీలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించారు. ఎక్కువ ఆదాయం, ఇప్పటికే ఇళ్లున్న వారుంటే వివరాలు అందజేయాలని సూచించారు. అలాంటి వారిపై విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెండు పడక గదుల కేటాయింపునకు వచ్చిన దరఖాస్తుల ప్రకారం లబ్ధిదారుల సమక్షంలో వీడియోగ్రఫీ నడుమ లాటరీ తీయించామన్నారు. ఇళ్ల కేటాయింపు కోసం ఎవరైనా డబ్బు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చకచకా పనులు

- శ్రీరామనవమికి ముస్తాబవుతున్న ఆలయ పరిసరాలు
- నేడు తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు ప్రారంభం
- వసంతోత్సవానికి ఘనంగా అంకురార్పణ



తలంబ్రాల తయారీకి ఏర్పాటు చేస్తున్న షామియానా

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 5 వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈనెల 30న శ్రీ సీతారాముల వారి కల్యాణం, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకలను పురస్కరించుకుని ఈ ఏడాది ముందుగానే పనులు ప్రారంభించారు. ఆలయం ఎదురుగా రెండు తాత్కాలిక యాగశాలలు నిర్మిస్తున్నారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి కొన్ని పనులు ప్రారంభం కాగా, మరికొన్ని చేపట్టాల్సి ఉంది. మిథిలా స్టేడియంలో భక్తుల సంఖ్యను కుదించి కొన్ని సెక్టార్లలో కొద్దిపాటి మార్పులు చేయడంతో అందుకు అనుగుణంగా బారికేడ్లు నిర్మిస్తున్నారు. స్వాగత ద్వారాలు, పెయింటింగ్, లైటింగ్ పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

22న గవర్నర్, సీఎంలకు ఆహ్వాన పత్రికలు..

శ్రీ సీతారాముల కల్యాణానికి రావాలని కోరుతూ ప్రతి సంవత్సరం ఉగాది రోజున గవర్నర్, సీఎం, ఇతర మంత్రులకు ఆహ్వాన పత్రికలు అందజేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 22న సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళి సై, ఇతర మంత్రులకు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు అందించనున్నారు. స్వామివారి కల్యాణ తలంబ్రాలలో కలిపే ముత్యాలు, పట్టు వస్త్రాలను ఆలయ అధికారులు ఆరోజే కొనుగోలు చేయనున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలను ఇప్పటికే ప్రారంభించగా, భక్తుల వసతికి సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంది.

నేడు తలంబ్రాల తయారీ పనులు షురూ..

శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు అందించే తలంబ్రాలను కలిపే పనులను వసంతోత్సవం రోజున ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది. ప్రతి సంవత్సరం చిత్రకూట మండపంలో నిర్వహించే ఈ పనులను ఈ ఏడాది ఉత్తర ద్వారం వద్ద చేపడుతున్నారు. ఈ మేరకు ఈఓ రమాదేవి ఆదేశానుసారం ఆలయ అధికారులు పెద్ద షామియానాలు, వేదికలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 180 క్వింటాళ్ల తలంబ్రాలను తయారు చేయాలని భావిస్తుండగా, తొలి విడతలో 100 క్వింటాళ్లు కలపనున్నారు. తొలిరోజు ఆలయ అర్చకుల కుటుంబీకులతో పసుపు, కుంకుమ దంచి, అనంతరం ప్రత్యేక గులాములతో తలంబ్రాలు తయారు చేసి రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం చుడతారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వామివారి నిత్యకల్యాణాన్ని రద్దు చేశారు.

వసంతోత్సవానికి అంకురార్పణ..

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా మంగళవారం జరగనున్న డోలోత్సవం, వసంతోత్సవానికి సోమవారం అంకురార్పణ చేశారు. మేళ తాళాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ పవిత్ర గోదావరి నుంచి తీర్థబిందెతో నదీ జలాలు తీసుకొచ్చి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం యాగశాలలో వాస్తు హోమం నిర్వహించారు. మంగళవారం బేడా మండపంలో వసంతోత్సవం, డోలోత్సవం జరపనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్రధారలతో స్నపనం, అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని ఊయలలో ఆశీనులు చేసి డోలోత్సవం నిర్వహిస్తారు.



వసంతోత్సవానికి తీర్థబిందె తీసుకొస్తున్న అర్చకులు

హక్కులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్యాంశ్రీ

కొత్తగూడెంఅర్బన్: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన ఉండాలని జిల్లా మొదటి అదనపు జడ్జి శ్యాంశ్రీ అన్నారు. ఉమెన్స్ డే వారోత్సవాల్లో భాగంగా స్థానిక బాబూక్యాంపు ఏరియాలో సోమవారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సెక్షన్ 125 సీఆర్పీసీ ప్రకారం భర్త నుంచి భార్య త్వరితగతిన భరణాన్ని పొందవచ్చని తెలిపారు. లింగ సమానత్వాన్ని సాధించడం ద్వారా సమాజంలో మహిళల ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పారు. న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని నిరుపేదలకు సత్వర న్యాయం అందించడానికి జిల్లా న్యాయ సేవా అధి కార సంస్థ ఆపన్నహస్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్కినేని సత్యనారాయణ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ చీఫ్ వి.పురుషోత్తమరావు, నిరంజన్‌రావు, జమాతే మహిళ జిల్లా అధ్యక్షురాలు పర్వీన్ ముస్తాఫా, కొత్తగూడెం జమాతే హింద్ ఇస్లాం ఆర్గనైజర్ షహనాజ్, బీసీ సంఘం అధ్యక్షురాలు మునిలా, లీగల్ సర్వీసెస్ సభ్యులు రాజమల్లు, సాదిక్ పాషా, కాసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కేంద్రాలు

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఆరోగ్య మహిళా కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మహిళా ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, సీపీఆర్ నిర్వహణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న మహిళలకు 8 రకాల అనారోగ్య సమస్యలకు ఉచిత వైద్యం అందించేందుకు జిల్లాలోని ఎర్రగుంట, పర్ణశాల, పెనగడప, ఎంపీ బంజర, కొమరారం పీహెచ్‌సీలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్, సర్వైవల్, రొమ్ము కేన్సర్ల స్క్రీనింగ్, థైరాయిడ్, సూక్ష్మపోషక లోపాలు, అయోడిన్, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపం, విటమిన్ బీ 12, విటమిన్ డీ పరీక్షలు చేసి మందులు అందజేస్తామని తెలిపారు. అకస్మాత్తుగా గుండెనొప్పికి గురైన వారికి సీపీఆర్ నిర్వహణ ద్వారా ప్రాణాలు కాపాడేందుకు 13వ తేదీన ప్రత్యేక కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీపీఓ రమాకాంత్, ఆస్పత్రుల సమన్వయ అధికారి రవిబాబు, ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు చండీహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన చేశారు. హోమంలో పాల్గొన దలిచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ గౌతమ్

భద్రాచలం: పరీక్షలు సమీపిస్తున్నందున ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి అర్హత మేరకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు ప్రబలుతున్నందున వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ రమాదేవి, అధికారులు తానాజీ, సురేష్ బాబు, శ్రీనివాస్, ఆదినారాయణ, దుర్గయ్య, మునీర్ పాషా, ప్రభాకర్ రావు, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, బాలమల్లు, రాజాచార్యులు, నాగభూషణం, ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- కొత్తగూడెంలోని పలు వార్డుల్లో కటకటే..
- పైప్‌లైన్ లీక్‌తో ఐదు రోజులుగా అందని నీరు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టని అధికారులు



దుర్గాస్‌బస్తీలో లీకవుతున్న ప్రధాన పైపులైన్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని కొన్ని వార్డుల్లో ప్రజలకు తాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం రాక ముందే నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు తలెత్తున్నాయి. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నిధులు కేటాయించి కిన్నెరసాని నుంచి నీరందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఎలాంటి ప్రణాళికలు లేవు. కిన్నెరసాని పంపులు రాని సమయంలో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ అధికారులకు ఫోన్ చేసి, సమస్య వివరించినా పట్టించుకోవడం లేదని ఆయా వార్డుల ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కిన్నెరసాని నీటి విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఏఈ తనకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

మరమ్మతులకు భారీగా నిధులు..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో కిన్నెరసాని నుంచి నీరు సరఫరా అయ్యే పైపుల మరమ్మతు పేరుతో ప్రతీ నెల కౌన్సిల్ సమావేశాల్లో రూ.లక్షల నిధులు కేటాయిస్తున్నారు. కానీ అవి బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. ప్రతీ నెల పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్నా తరచూ లీకవుతూనే ఉన్నాయి. దీంతో పాటు ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని ఫిల్టర్ బెడ్‌లో రెండు, మూడు నెలలకు ఓసారి మోటార్లు కాలిపోతుండడంతో పట్టణానికి నీటి సరఫరా నిలిపేస్తున్నారు. మోటార్లు, పైప్‌లైన్ల ఏర్పాటులో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ సమస్య ఏర్పడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక ప్రస్తుతం మున్సిపాలిటీకి వాటర్ ట్యాంకులు రెండే ఉన్నాయి. వీటి సంఖ్యను పెంచి పంపులు రాని సమయంలో ప్రతి వార్డుకు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రామాటాకీస్, దుర్గాస్‌బస్తీ ఏరియాల్లో గల పెద్ద పైపులైన్ లీకేజీతో దుర్గాస్‌బస్తీకి ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసినా మరమ్మతు చేయలేదని, కనీసం ట్యాంకర్‌తో కూడా నీరు సరఫరా చేయడం లేదని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇక హనుమాన్‌బస్తీ, బూడిదగడ్డ, భజన మందిరం ఏరియా, గాజులరాజం బస్తీ తదితర ప్రాంతాలకు కూడా నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గొల్లగూడెం ఏరియాలో నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని, అందులో నీరు నిల్వ చేస్తే పైపులైన్లు మరమ్మతులకు గురయినప్పుడు ట్యాంకు ద్వారా ఆయా ప్రాంతాలకు అందించే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

నీటి సమస్య లేకుండా చూస్తాం

కొత్తగూడెం పట్టణంలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. పట్టణంలోని వార్డుల్లో కిన్నెరసాని పైపులు లీకయితే ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నాం. రిపేర్లకు మూడు, నాలుగు రోజుల సమయం పడుతుంది. దీంతో నీటి సరఫరా నిలిచిపోతోంది. ఆ సమస్య రాకుండా చూస్తాం.
– జి.రఘు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి


ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: అర్హులైన పేద ప్రజలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ కోరారు. స్థానిక నవభారత్ సమీపాన నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించి దమ్మపేట సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలన్నారు. నాయకులు పానిశెట్టి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాస్, ప్రభాకర్, రావేందర్, రంజిత్, ప్రశాంత్, లక్ష్మణ్, హరిహరన్ ల్గొన్నారు.

మహిళలు రాణించాలి

భద్రాచలం: మహిళలు అన్ని రంగాల్లో పాల్గొని రాణించాలని ఐటీడీఏ డీడీ రమాదేవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఐటీడీఏలో ఉద్యోగినులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగినులు సులోచన, భవాని, మాధవి, మణికుమారి, స్వాతి , అలివేలు మంగతాయారు, పార్వతి, రాజ్యలక్ష్మి, సరోజిని, కృష్ణవేణి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి యువకుడు మృతి

ములకలపల్లి : చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మాదారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మాదారంలో నివసించే వల్లావరపు వెంకటకృష్ణ (34) క్షౌరవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం చేపలు పట్టేందుకు వెళ్లి ఊరచెరువులో పడిపోయాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లి, వెంకటకృష్ణను వెలికితీసి మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుని భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లి.. విజయనగరంలో మృత్యువాత..

చంద్రుగొండ : మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉపాధి కోసం వెళ్లి విజయనగరంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గుంపెనపల్లి పాపయ్య, బుచ్చమ్మలకు నలుగురు సంతానం . అందులో మూడో కుమారుడు నరహరి(40) విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాడు. 20 రోజుల క్రితం ఏపీలోని విజయనగరం జిల్లా గుగ్గులం గ్రామంలో పనికి వెళ్లాడు. ఆదివారంరాత్రి భోజనం చేసిన తర్వాత తోటి కూలీలతో కలిసి నరహరి ఓ భవనంపై పడుకున్నాడు. ఉదయం తోటి కార్మికులు నిద్రలేచి చూసే సరికి బిల్డింగ్‌పై నుంచి కిందపడి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా, మృతుడి సోదరుడు పూర్ణచందర్‌రావు అక్కడికి వెళ్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విజయనగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు అవివాహితుడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

దమ్మపేట : ఆగిఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మందలపల్లికి చెందిన నల్లగుళ్ల సీతారాం (50), అడపా చిన్న ఇద్దరు కలిసి బైక్‌పై అచ్యుతాపురం గ్రామానికి వెళ్లారు. తిరిగొస్తుండగా మందలపల్లి సమీపంలో ఆగిఉన్న టాక్టర్‌ను బైక్ ఢీకొన్నది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలిస్తుండగా, సీతారాం మార్గంమధ్యలో మృతి చెందాడు.

గంజాయి స్వాధీనం

మణుగూరుటౌన్: అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ ముత్యం రమేష్, ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. తోగ్గూడెం సమీపంలోవాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు సీలేరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కూసుమంచికి చెందిన బానోత్ బాలకృష్ణ, భద్రాచలానికి చెందిన ఆటోడ్రైవర్ మహమ్మద్ సాల్మన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆటో, ద్విచక్రవానం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి అపహరణకు యత్నం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అపహరించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించినట్లు స్కూల్ యాజమాన్యం గుర్తించింది. విద్యార్థిని తల్లిదండ్రులు తీసుకురమ్మన్నారంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం పాఠశాలకు వచ్చాడు. అతడి వ్యవహారశైలిపై అనుమానం కలిగిన పాఠశాల సిబ్బంది గట్టిగా ప్రశ్నించగా అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తుంది. తల్లిదండ్రులు సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

కాసుల వర్షం

రిజిస్ట్రేషన్ శాఖకు రూ.204 కోట్ల రాబడి

- రూ.100 కోట్లు దాటిన ఖమ్మం కార్యాలయ ఆదాయం
- ఇంకా పెరిగే అవకాశముందని అంచనా
- రెండో స్థానంలో కొత్తగూడెం, లాస్ట్ భద్రాచలం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు అయిన రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో కాసుల పంట పండింది. రియల్ మార్కెట్ మందగించినా, ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగకపోయినా.. ఆర్థిక సంవత్సరానికి ముగియడానికి ఇంకా సమయం ఉండగానే ఉమ్మడి జిల్లాలో రూ.204 కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీల ద్వారా అత్యధిక ఆదాయం రాగా.. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా కొంత ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. ఖమ్మం రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే అత్యధిక ఆదాయం వచ్చింది.

42వేలకు పైగా డాక్యుమెంట్లు

ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల కోసం 42,843 డాక్యుమెంట్లు వచ్చాయి. వీటి ద్వారా రూ.204,49,27,000 ఆదాయం రాగా.. ఇందులో స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.150,40,66,000, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా రూ.23,79,03,000, రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా రూ.29,29,57,000 సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం 57,816 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. శాఖకు రూ.230,63,97,000 ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ఫీజు భారీగా తగ్గింది. అయితే ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 24 రోజులు సమయం ఉన్నందున శాఖకు మరింత ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఖమ్మంలోనే అత్యధికం..

ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే ఈ ఆర్థిక సంవత్సరం అత్యధిక ఆదాయం సమకూరింది. ఇప్పటి వరకు ఈ కార్యాలయం ద్వారా 14,364 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేయగా.. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా రూ.101,42,83,000 ఆదాయం చేకూరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యాలయం నుంచి రూ.92,54,4000 ఆదాయం రాగా.. ఈసారి రూ.100 కోట్ల మార్క్‌ను దాటడం విశేషం. ఆతర్వాత స్థానాల్లో కొత్తగూడెం, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిలవగా.. భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అత్యల్పంగా రూ.3.53 లక్షల ఆదాయమే వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ రూ.4.32 లక్షల ఆదాయం రాగా ఈసారి మరింత తగ్గడం గమనార్హం.

ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు నమోదైన ఆదాయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయం
ఖమ్మం	రూ.101,42,83,000
కొత్తగూడెం	రూ.28,23,46,000
ఖమ్మం రూరల్	రూ.24,16,37,000
కూసుమంచి	రూ.13,44,18,000
వైరా	రూ.11,19,08,000
మధిర	రూ.10,87,23,000
సత్తుపల్లి	రూ.8,40,99,000
కల్లూరు	రూ.4,66,01,000
బూర్గంపాడు	రూ.1,24,40,000
ఇల్లెందు	రూ.81,17,000
భద్రాచలం	రూ.3,53,000

రియల్ ఎస్టేట్ మందగించినా..

గత కొంతకాలంగా జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. దీంతో సహజంగానే రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. భూముల క్రయవిక్రయాలు తగ్గడం, ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగకపోవడమేనని దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. మళ్లీ కొంత కాలంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం, రెండుసార్లు మార్కెట్ వాల్యూ పెరగడం, ఫీజుల శాతం పెంపుతో ఆదాయం పెరిగిందని తెలుస్తోంది.

తరలిరాద తనే వసంతం..

నేడు రంగుల పండుగ హోలీ


విరబూసిన మోదుగు పూలు

మణుగూరుటౌన్/ఇల్లెందు: వసంత రుతువును ఆహ్వానిస్తూ వచ్చే పండుగ హోలీ. దేశవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుక జరుపుకుంటారు. జిల్లా ప్రజలు మంగళవారం రంగులు పులుముకునేందుకు సిద్ధమయ్యారు. యువతీ యువకులు ఇప్పటికే రంగులు తెచ్చి పెట్టుకున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంతోపాటు ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ, భద్రాచలం, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. ఇల్లెందు పట్టణంలోని ఆంబజార్‌లో రాజస్తాన్ సేవా మండలి ఆధ్వర్యంలో కామదహనానికి ఏర్పాట్లు చేశారు. కాగా రసాయనాలతో తయారయ్యే రంగులు పూసుకోవడం ఆరోగ్యానికి, ప్రకృతికి హానికరమని వైద్య, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

పూర్వం మోదుగు పూలు..

పూర్వం పల్లెల్లో మోదుగు పూలతో తయారు చేసిన రంగులను పూసుకునేవారు. పండుగకు వారం రోజుల ముందే తెచ్చుకుని, మట్టిపాత్రలో నానబెట్టేవారు. ఒకరోజు ముందు పూల నుంచి ఊరిన ఊట రసాన్ని పసుపు, కుంకుమలతో మిళితం చేసి బాటిల్‌లో నింపి సిద్ధం చేసుకునేవారు. హోలీ రోజు పరస్పరం మీద చల్లుకుని ఆనందించేవారు. ఈ రంగుతో ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎటువంటి ప్రమాదం ఉండేది కాదు. కాగా కాలక్రమంలో మోదుగు పూల రంగుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది.


ఇల్లెందు ఆంబజార్‌లో రాజస్థాన్ భజన మండలి ఆధ్వర్యంలో కామదహనం కోసం ఏర్పాట్లు..

ప్రకృతి సిద్ధమైన రంగులనే చల్లుకుందాం



రసాయనాలు కలిసిన రంగులు చల్లుకుంటే కళ్లకు ప్రమాదాలు జరుగుతాయి. ప్రకృతి కాలుష్యం బారిన పడుతుంది. ప్రకృతి సిద్ధమైన రంగులను మాత్రమే చల్లుకోవాలి. కామదహనం కూడా ఇంట్లో పాడైన వస్తువులతో మాత్రమే చేయాలి. ప్లాస్టిక్ వస్తువులను కాల్చి పర్యావరణం కలుషితం చేయొద్దు. హోలీ పండుగకు విరబూసే మోదుగుపూల రంగులు చల్లుకుంటే ఎంతో మేలు. పర్యావరణ హితం కూడా.

–జీఏస్ చంద్రశేఖర్, పర్యావరణ ప్రేమికుడు, మణుగూరు

తాగునీటి సరఫరాకు అంతరాయం

13 నుంచి 'మిషన్ భగీరథ'లో పూడికతీత పనులు

అశ్వాపురం: పూడిక తీత పనుల నేపథ్యంలో ఈ నెల 13 నుంచి 29వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ ఈఈ నళిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద మిషన్‌భగీరథ ఇంటెక్‌వెల్‌లో, పంప్‌హౌస్‌లో నాలుగేళ్లుగా గోదావరి ప్రవాహం వల్ల ఇసుక, సిల్ట్ పేరుకుపోయాయని పేర్కొన్నారు. పూడిక తీత పనులు చేపడుతున్నందున 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు రోజు విడిచి రోజు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు. గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రకటించిన తేదీలలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రూరల్ గ్రామాల్లో రెగ్యులర్‌గా నీటి సరఫరా ఉంటుందని, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలో నిరంతరం, గ్రామాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా ఉంటుందని వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గ గ్రామాల్లో, పినపాక నియోజకవర్గంలో రోజు విడిచి రోజు నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.

రేపటి నుంచి రిలే దీక్షల కొనసాగింపు

- విద్యుత్ ఉద్యోగుల ఆందోళన యథాతథం
- యాజమాన్యంతో జేఏసీ చర్చలు విఫలం


ఆందోళన చేస్తున్న కేటీపీఎస్ ఉద్యోగులు (ఫైల్)

పాల్వంచ: పీఆర్‌సీ విడుదలపై సోమవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో యాజమాన్యాలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో తిరిగి ఆందోళన కొనసాగిస్తామని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ నెల 8 నుంచి రిలే నిరాహార దీక్షలు కొనసాగనున్నాయి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు 2022 పీఆర్‌సీ సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉంది. దీంతో జేఏసీ ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, సోమవారం జేఏసీ నేతలతో యాజమాన్యాలు చర్చలు జరిపాయి. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండి రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్ రావు, ఎం.ఎ.వజీర్, అనిల్, శ్రీధర్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. పీఆర్‌సీ 40 శాతం ఇవ్వాలని జేఏసీ నేతలు కోరగా, 6 శాతం ఇస్తామని యాజమాన్యం పేర్కొన్నట్లు సమాచారం. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చే అంశంపై స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. దీంతో కార్మిక సంఘాలు తిరిగి ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నేడు హోలీ పండుగ కాగా, మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు అన్ని సంస్థల ముఖ్య కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నారు. 24న విద్యుత్ సౌధ ముట్టడి, చివరగా మెరుపు సమ్మె చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

మహిళలకు రక్షణ కరువు

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య


మాట్లాడుతున్న సంధ్య

ఇల్లెందు: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, హిందూ ఫాసిస్టు శక్తులు దాడులకు పాల్పడుతున్నాయని, పాలకులు దోషులకు అండగా నిలుస్తున్నారని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి. సంధ్య ఆరోపించారు. సోమవారం ఇల్లెందులో జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. గుజరాత్‌లో బిల్కిస్ భానుపై లైంగిక దాడి, ఆమె కుటుంబసభ్యులు 13మందిని హత్య చేసి న దోషలను రక్షించేందుకు స్వయంగా ప్రధాని మోడీ సహకరిస్తున్నారని ఆరో పించారు. మహిళలు హక్కులు, ఆత్మరక్షణ, సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 27ఏళ్లుగా పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదం పొందడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి మెడికల్ విద్యార్థి ప్రీతి హత్య నిదర్శనమని అన్నారు. నాయకులు బయ్యా శారద, కృష్ణవేణి, నోముల కళావతి, మోకాళ్ల సుగుణ, మున్సిపల్ కౌన్సిలర్ రేళ్ల నాగలక్ష్మి, సమ్మక్క పాల్గొన్నారు.

ఠాణా ఎదుట మహిళ బైఠాయింపు

భర్తపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన


పెట్రోల్ బాటిల్‌తో రోడ్డుపై బైఠాయించిన నూర్జహాన్, కుటుంబీకులు

దమ్మపేట : భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదంటూ ఓ మహిళ ఠాణా ఎదుట రహదారిపై బైఠాయించి నిరసన తెలిపింది. ఈ ఘటన దమ్మపేటలో సోమవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. దమ్మపేటకు చెందిన నూర్జహాన్‌కు అదే గ్రామానికి చెందిన నాగుల్‌మీరాతో పదిహేనేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కాగా కొంతకాలంగా భర్త, అతని కుటుంబీకులు నూర్జహాన్‌ను అనుమానిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కాగా ఆదివారం అర్ధరాత్రి కూడా నాగుల్‌మీరా, అతని కుటుంబ సభ్యులు నూర్జహాన్‌ను కొట్టారు. దీంతో ఆమె 100 డయల్ చేయగా, అక్కడకు వచ్చిన పోలీసులు పెద్దగా స్పందించలేదు. దీంతో నూర్జహాన్ తన సోదరుడితో కలిసి పెట్రోల్ బాటిల్‌తో పాల్వంచ-మందలపల్లి రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. న్యాయం జరిగే వరకూ కదిలేదిలేదని భీష్మించారు. మహిళ సోదరుడు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి, స్థానికులు బాధిత కుటుంబంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నాగుల్‌మీరాతో పాటు మరోము గ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శావణ్‌కుమార్ తెలిపారు.

పట్టపగలే చోరీకి యత్నం

చంద్రుగొండ : మండలకేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో పవన్‌సాయి ఆటోమొబైల్ షాపులో సోమవారం పట్టపగలు ఇద్దరు యువకులు చోరీకి యత్నించారు. మధ్యాహ్నం సమయంలో షాపు యజమాని కొమ్మిని కృష్ణయ్య పక్క దుకాణం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని యువకులు షాపులోకి ప్రవేశించి గల్లా పెట్టె తెరిచి కొంత నగదు తీసుకున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. ఈలోగా యజమాని రావడంతో కంగారు పడి, ఆయన్ను నెట్టివేసి అక్కడే ఆపి ఉన్న ద్విచక్రవాహనంపై పరారయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అమెర్దలో విషజ్వరాల వ్యాప్తి

బాధితులతో కిటకిటలాడుతున్న అశ్వాపురం పీహెచ్‌సీ


అశ్వాపురం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు


ఒకే బెడ్‌పై ఇద్దరు బాధితులకు చికిత్స..

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలో పలువురు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఇద్దరు డెంగీ జ్వరం బారిన పడ్డారు. అశ్వాపురం పీహెచ్‌సీతోపాటు భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పలువురు పొందుతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్య వల్ల జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని కోరుతున్నారు.

ఆస్పత్రి కిటకిట..

అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సోమవారం జ్వరబాధితులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పీహెచ్‌సీలో జ్వరాలు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు అధిక సంఖ్యలో వచ్చారు. వైద్యాధికారి సంకీర్తన ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒకే బెడ్‌పై ఇద్దరికి చొప్పున ఫ్లూయిడ్స్ ఎక్కిస్తుండటంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. పీహెచ్‌సీలో తగిన వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఆమెర్ద జ్వరాల విజృంభణపై వైద్యాధికారి డాక్టర్ సంకీర్తనను వివరణ కోరగా.. శనివారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. గ్రామంలో ఒక కుటుంబంవారే జ్వరాలతో బాధపడుతున్నారని, వారికి పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జ్వర పీడితులు పీహెచ్‌సీకి వస్తే వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరిస్తామని పేర్కొన్నారు.

బోడు మండలం ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: బోడు కేంద్రంగా నూతన మండలం, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బోడు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. బోడు మండలాన్ని సాధించే వరకూ పోరాటాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అరుణోదయ కళాకారుల ఆటాపాట అందరినీ ఆకట్టుకుంది. సభలో ఎంపీపీ భూక్య రాధ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నేత లక్కినేని సురేందర్, ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, సర్పంచ్‌లు ఇర్ప లక్ష్మీనారాయణ, ఈసాల ఉపేందర్, మాడె మధు, న్యూడెమోక్రసీ, ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, అరుణోదయ నాయకులు, ఎట్టి నరసింహారావు, కల్తి వెంకటేశ్వర్లు, చింత ఉదయ్, వినోద్, రామచంద్రు, చిరంజీవి, కోడి శ్రీరాములు, కాంతారావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781